సాక్షి
వికారాబాద్
బుధవారం । 26 । జూన్ । 2024



వేతనాలు చెల్లించాలి

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. 8లో▸



రైతన్నచూపు.. సన్నాల వైపు

సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని సర్కారు ప్రకటించడంతో రైతులు ఆ దిశగా మొగ్గు చూపుతున్నారు. 8లో▸



'నీట్' మళ్లీ నిర్వహించాలి

నీట్, యూజీసీ నెట్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ భవన ప్రారంభోత్సవం

అనంతగిరి:జిల్లా కేంద్రం వికారాబాద్‌లో నూతనంగా నిర్మించిన జెడ్పీ భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ భవనాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొననున్నట్లు జెడ్పీ సీఈఓ సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు నేస్తాన్ని సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

పూడూరు: రైతు నేస్తం కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. మంగళవారం పూడూరు మండల కేంద్రంలో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పలు సలహాలు సూచనలు అందించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతు భరోసా ద్వారా ఆర్థిక చేయూత అందించేందుకు విధివిధానాలను రూపొందిస్తోందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలన్నారు. వరి, మొక్కజొన్న సాగు పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట మార్పిడితో చీడపీడలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను నివృత్తి చేశారు. ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో పరిగి డివిజన్ అధికారి లక్ష్మికుమారి, డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పనుల్లో జాప్యం వద్దు

స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి

బంట్వారం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పక్కాగా చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా ఉండాలని ఆదేశించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు బిగించాలన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఎంపీఓ విజయ్‌కుమార్, ఏఈ లక్ష్మణ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు

రోగులకు సకాలంలో వైద్యం అందాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న సాయిబాబా

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని మాతాశిశు సంరక్షణ, న్యూట్రిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సాయిబాబా సూచించారు. మంగళవారం కుల్కచర్ల ప్రభుత్వాస్పత్రిని, బండవెల్కిచర్ల పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యురాలు మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

షాద్‌నగర్ రూరల్: గోరు బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. 'మా తండాలో మా రాజ్యం'.. డిమాండ్‌తో వచ్చే నెల 1వ తేదీ హైదరాబాద్‌లో గోరు బంజారా జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైల్వే.. సర్వే



రేగడిమైలారంలో రైల్వే లైన్ కోసం ల్యాండ్ లెవెల్ సర్వే చేస్తున్న సిబ్బంది

వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్‌కు మార్గం సుగమం

- బొంరాస్‌పేట మండల శివారులో ల్యాండ్ లెవల్ సర్వే
- కొడంగల్ నియోజకవర్గం మీదుగా రైల్వే లైన్
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ మీదుగా రైల్వే మార్గం ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి. జిల్లా కేంద్రం వికారాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు సమీపంలోని కృష్ణా రైల్వే మార్గానికి రూపొందించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతున్నాయి. తాజాగా లైన్ ఏర్పాటుకు డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేస్తున్నారు. మరోవైపు వారం రోజులుగా బొంరాస్‌పేట మండల శివారులోని పలు గ్రామాల్లో ల్యాండ్ లెవెల్ సర్వే జరుగుతోంది. దీంతో మండల ప్రజల్లో సంతోషం మొదలైంది.

రైల్ 'వే'.. 'గో'వా

దేశంలోనే అతి పెద్ద పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న గోవాకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి రైల్వే మార్గం ఏర్పాటు కానుంది. ఈ పనులు సీఎం నియోజకవర్గ కేంద్రం నుంచి కార్యరూపం దాల్చను న్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి యాద్గిర్, రాయచూర్, గుంతకల్ మీదుగా గోవాకు ఓ మార్గం ఉంది. మహబూబ్‌నగర్, కర్నూల్, గుంతకల్, హుబ్లీ మీదుగా మరో మార్గం ఉంది. కొడంగల్ మీదుగా మూడో మార్గం ఏర్పాటు కానుంది.

కొడంగల్‌కు కొత్త సొబగులు

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్లాలంటే సుమారు 290 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంది. కొడంగల్ రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే మెరుగైన రవాణాతోపాటు దూరం కూడా తగ్గుతుంది. గతేడాది రైల్వేశాఖ సర్వే పనులను ప్రారంభించగా.. కొడంగల్ ప్రాంతంలో పనులు ఊపందుకున్నాయి. వెనకబడిన ప్రాంతంగా ఉన్న కొడంగల్‌కు రైల్వే లైన్‌తో కొత్త సొబగులు రానున్నాయని ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రత్యేక చొరవతో..

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్‌కు అప్పటి ప్రభుత్వాలు సర్వే చేసినా పనులు పట్టాలెక్కలేదు. రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి రైల్వే లైన్‌పై హామీ ఇస్తూ వచ్చారు. సీఎం అయ్యాక ఇచ్చిన మాట ప్రకారం రైల్వే లైన్‌కు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రూ.2,196 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ మార్గం కొడంగల్ తోపాటు వికారాబాద్, పరిగి, నారాయణపేట, మక్తల్ పట్టణాలకు రైల్వే మార్గం ఏర్పడనుంది. ఇది అత్యుత్తమ మార్గంగా సులభతరం కానుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. వికారాబాద్ నుంచి ధారూరు, యాలాల మండలాల పరిధిలోని బొంరాస్‌పేట మండలంలోని వడిచర్ల, ఎన్కేపల్లి, రేగడిమైలారం పరిధిలో నుంచి కొడంగల్ పట్టణం బండల ఎల్లమ్మ ఆలయం ముందు నుంచి పట్టణ కేంద్రం శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి లంకాదహనం స్థలంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం.



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న గ్రామస్తులు

అభివృద్ధికి మార్గం



కొడంగల్ నియోజకవర్గం నుంచి రైల్వే మార్గం ఏర్పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఉంటుంది. ఊహించని రీతిలో రైల్వే లైన్ సర్వే పనులు సాగుతున్నాయి. వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంతోపాటు ఉపాధి కల్పించాలి.

– జయతీర్థాచారి, రేగడిమైలారం



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి చిత్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

త్వరలో అభివృద్ధి పనులు

కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కడ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.5 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించినట్లు చెప్పారు. అసైన్డ్‌మెంట్, అటవీ, అన్యాక్రాంతమైన, సాగులో లేని భూములను సేకరిస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనుల వివరాలు

నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అనుమతులు. ఒక్కో కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.7.13 కోట్ల చొప్పున రూ.14.26 కోట్లు మంజూరు చేశారు.

- కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణాలు, మౌలిక వసతులకు రూ.124.50 కోట్లు విడుదల చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంజూరు చేశారు. భవనాలు, వసతుల కోసం రూ.46 కోట్లు కేటాయించారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వీటి కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇందు కోసం రూ.27 కోట్లు కేటాయించారు.
- కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు మంజూరు చేశారు. దీని సామర్థ్యం పెంచి నిధులను రెట్టింపు చేశారు.
- కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మార్చి రూ.30 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.20 కోట్లతో భవనాలు, రూ.10 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తారు.
- కోస్గికి కొత్తగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. భవనాలు, వసతుల కోసం రూ.11 కోట్లు విడుదల చేశారు.
- సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు ఆధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులో కొత్త భవనాలను నిర్మిస్తారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మాణానికి రూ.6 కోట్లు విడుదల చేశారు.
- నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు కేటాయించారు.
- ప్రభుత్వ పాఠశాలల భవనల నిర్మాణాలకు రూ.30 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేశారు. ఇవే కాకుండా పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. త్వరలో పనులను ప్రారంభించనున్నారు. ఇందుకోసం కలెక్టర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం పరిగి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తే ఎక్కడ ఏం జరిగినా తక్షణం సమాచారం అందుతుందని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అనుసరించాలన్నారు. ఉంటేనే డయాల్ 100కు కాల్ వస్తుందని.. ఫోన్ రాగానే స్పందించాలని సూచించారు. పెండింగ్ కేసులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ స్టేషన్ సందర్శన

కొడంగల్: జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు క్వార్టర్లు లేని విషయాన్ని ఎస్పీ గుర్తించారు. ఆన్ డ్యూటీలో ఉన్న సిబ్బంది బస చేయడానికి ఇబ్బంది పడుతున్నారని పోలీసు అధికారులు ఎస్పీ దృష్టికి తెచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పౌల్ట్రీ రైతులు

ఆస్తిపన్ను బకాయిలు రద్దు చేయండి

మంత్రికి తుమ్మలకు పౌల్ట్రీ రైతుల విజ్ఞప్తి

షాద్‌నగర్: పౌల్ట్రీ పరిశ్రమకు ఆస్తిపన్ను బకాయి రద్దు చేయాలని కోరుతూ పౌల్ట్రీ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు షాద్‌నగర్‌కు చెందిన పలువురు పౌల్ట్రీ రైతులు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పౌల్ట్రీలపై ఆస్తిపన్ను వేసిన దాఖలాలు లేవని తెలిపారు. కేవలం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పౌల్ట్రీలపై మాత్రమే ఆస్తి పన్ను విధించారని, వాటిని రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ చట్టం ప్రకారం పౌల్ట్రీని ఒక యూనిట్‌గా చేసి కేవలం వంద రూపాయలు మాత్రమే మెయింటనెన్స్ కింద వసూలు చేయాలని, కానీ అధికారులు మాత్రం పెద్ద మొత్తంలో పన్నులు వేశారని మంత్రి దృష్టికి తెచ్చారు. పన్నులను రద్దు చేసి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పౌల్ట్రీ రైతులు రామారావు, వెంకట నారాయణ, శ్రీనివాసరావు, అర్జున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మల్లికార్జునరావు, బండారు సతీష్, శరత్, మధు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన 'లవ్ ప్రపోజల్'

సరదాగా చేసిన తప్పు.. ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. ఎంతో కష్టపడి ఆర్మీలో ఉద్యోగం సాధించి, దేశ రక్షణలో భాగస్వామి అవుతాడనుకున్న కొడుకు శవంగా మారి.. పాడె ఎక్కడాన్ని తల్లిదండ్రులు భరించలేక పోతున్నారు.

- ఉరేసుకుని ఆర్మీ ఉద్యోగి బలవన్మరణం
- కొత్తపల్లిలో ఘటన



చింటు మృతదేహం



చింటు (ఫైల్)

దోమ: పరువు పోతుందనే మనస్తాపంతో ఓ ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంట రాములు, మంగమ్మకు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు సంతానం. వీరిలో చింటు (21) పెద్దవాడు. డిగ్రీ పూర్తి చేసిన ఇతను అగ్నిపథ్‌లో భాగంగా ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యాడు. ఇటీవలే బెంగళూర్‌లో శిక్షణ పూర్తి చేసుకోగా.. గుజరాత్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులు సెలవులు ఇవ్వడంతో ఈనెల 22న ఇంటికి వచ్చాడు. గత సోమవారం తన ఇద్దరు స్నేహితులతో కలిసి చింటు సరదాగా బయటకు వెళ్లాడు. ఇదిలా ఉండగా సాయంత్రం వేళ దాదాపూర్‌లో స్కూల్ ముగించుకుని కాలి నడకన గుండాలకు వెళ్తున్న ఓ బాలికను గమనించిన చింటు.. ఆమెకు లవ్ ప్రపోజ్ చేస్తానని స్నేహితులతో చెప్పాడు. ఆ వెంటనే వెళ్లి నేను నిన్ను ప్రేమిస్తున్నా.. ఇందుకు అంగీకరించమని కోరాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి కొత్తపల్లికి చేరుకుని చింటు తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. అతను వెళ్లిపోయిన తర్వాత ఇంటికి చేరుకున్న చింటు జరిగిన విషయం గ్రామంలో తెలిస్తే తనతో పాటు తల్లిదండ్రుల పరువు పోతుందని మనస్తాపానికి గురయ్యాడు. అనంతరం బైక్ తీసుకుని పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన కొడుకు అర్ధరాత్రి దాటినా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పాయిపల్లిలో మెడికల్ కళాశాల

- భూములను పరిశీలించిన రెవెన్యూ అధికారులు
- హద్దులు చూపిన రైతులు

కొడంగల్: మండలంలోని అప్పాయిపల్లి (ఎరన్పల్లి) శివారులో మెడికల్ కళాశాలను నిర్మించనున్నారు. మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఆర్ఐ శ్రుతితో పాటు రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ గ్రామంలోని సర్వే నంబర్ 19లో గల స్థలాలను పరిశీలించారు. భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న రైతులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి భూములు ఇస్తున్న రైతులు వారి పొలాల హద్దులను అధికారులకు చూపించారు. కళాశాల నిర్మాణానికి ప్రస్తుతం 20 ఎకరాల భూమిని సేకరించినట్లు అధికారులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో కారణంగా ఇన్నాళ్లు పనుల్లో పురోగతి లేదు. కోడ్ ముగియడంతో అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. పనులను వెంటనే ప్రారంభించే విధంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం మరో రూ.46 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలను, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వీటి నిర్మాణం కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు. ఈ భవన నిర్మాణాల కోసం మండలంలోని అప్పాయిపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను గుర్తించారు. భూములు ఇచ్చే రైతులకు పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.



మెడికల్ కళాశాల కోసం భూ సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

క్లుప్తంగా

కలకలం రేపిన కాల్పుల శబ్దం

రక్తపు మరకల ఆనవాళ్లను గుర్తించిన ఫారెస్ట్, పోలీసు అధికారులు



రిసార్ట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి శివారులో సోమవారం రాత్రి వేటగాళ్ల కాల్పుల శబ్దాలు కలకలం రేపాయి. ఈ విషయం ఫారెస్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ఫారెస్ట్, పోలీసు అధికారులు మంగళవారం సంయుక్తంగా విచారణ చేపట్టారు. ఎఫ్ఆర్ఓ అరుణ, ఇతర సిబ్బంది గ్రామ శివారు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లాస్ట్ ఇన్ విలేజ్ రిసార్ట్‌లోనూ తనిఖీలు నిర్వహించారు. అక్కడే ఉన్న జీపులో రక్తపు మరకల ఆనవాళ్లు కనిపించాయి. వాహనంలో ఓ కత్తి, బ్యాటరీని స్వాధీనం చేసుకున్నారు. రెస్టారెంట్ చుట్టు పక్కల క్షుణ్నంగా పరిశీలించారు. రక్తపు ఆనవాళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తమ సిబ్బంది విచారణలో జీపు, పరికరాలను స్వాధీనం చేసుకున్నామని.. జంతు వేట చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

తైబజార్@రూ.4.08లక్షలు



ధారూరు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

ధారూరు: ప్రతీ శనివారం ధారూరు పంచాయతీ ఆవరణలో నిర్వహించే కూరగాయల మార్కెట్‌కు మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో తిమ్మానగర్‌కు చెందిన కోడిగంటి మహేశ్ రూ.4.08లక్షలకు దక్కించుకున్నారు. ధారూరుకు చెందిన చాకలి లక్ష్మయ్య రూ.4.07లక్షలు వరకు వేలంలో పాల్గొన్నారు. మార్కెట్‌లో నిర్ణీత రుసుముతో గంప, చాప, టెంట్‌లకు డబ్బు వసూలు చేసుకోవాలని చెప్పారు. మొదటి వ్యక్తి డబ్బు చెల్లించకుంటే రెండో వ్యక్తికి కేటాయించే అవకాశం ఉంటుందన్నారు. ఈ వేలంలో ఎంపీడీఓ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి అంజానాయక్, వ్యాపారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు

మోమిన్‌పేట: తై బజార్‌లో వేలం దక్కించుకున్న వారు తప్పవని కార్యదర్శి నర్సింలు హెచ్చరించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అధ్యక్షతన తై బజార్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఎల్.ప్రతాప్‌రెడ్డి, జె.బాగయ్య పాల్గొన్నారు. వేలంలో రూ.2,10,00లక్షలు బాగయ్య దక్కించుకున్నారు. బుధవారం నుంచి 2025 మార్చి 31 వరకు వారాంతపు సంతలో కూరగాయల దుకాణాల నుంచి ఒక్కో దుకాణానికి రూ.30కు మించుకుండా వసూలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా ట్రస్టు జిల్లా అధ్యక్షుడిగా రవి



రవిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మోమిన్‌పేట: అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్టు జిల్లా అధ్యక్షుడిగా రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని ఏన్కతల శనైశ్చరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నీలి శ్రీకాంత్, కోశాధికారిగా మనోహర్‌రెడ్డి, కార్యదర్శిగా గిరిగౌడ్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, విఘ్నేశ్, వీరబాబు, కోనారెడ్డి, నిర్మల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు చూపు.. సన్నాల వైపు

ఈ వానాకాలం సీజన్ నుంచి సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సన్నాల సాగు పెరగనుంది. సాగువిస్తీర్ణం గతం కన్నా పెరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

- ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో అన్నదాత ఆసక్తి
- యాసంగిలో తేమ ఉన్నా మంచి ధర ఇచ్చిన మిల్లర్లు
- తగ్గనున్న దొడ్డు రకం వరి సాగు



దుద్యాల్‌లో ఆర్ఎన్ఆర్-15048 రకం వరి నారు

దుద్యాల్: ఇటీవల ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధర కంటే రూ.500 ఎక్కువగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్నరకం వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో దొడ్డు రకం వరి సాగు చేసిన రైతులు ఈ వానాకాలంలో సన్న రకం సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒక వేల ప్రభుత్వం సన్న రకం వడ్లను కొనుగోలు చేయకున్నా.. మండలంలో అత్యాధునిక రైస్ మిల్లులుండడం, ఆయా మిల్లుల యాజమాన్యం ధాన్యంలో తేమ శాతం 25 నుంచి 30 వరకు ఉన్న ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా క్వింటాలుకు రూ.2500 నుంచి రూ.3వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో సన్నాలు సాగు చేసి వెంటనే విక్రయించుకుందామనే ఆలోచనలో ఉన్నారు.

దొడ్డు రకంతో ఇబ్బందులు

గత యాసంగి సీజన్‌లో మండల పరిధిలో దాదాపు 9 వేల ఎకరాల వరకు సాగు చేశారు. దొడ్డు రకం వరి సాగు చేసిన రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డు రకం పంట కాలం సైతం ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులు తక్కువ కాలంలో చేతికి వచ్చే సన్నాలనే సాగు చేస్తున్నారు. దొడ్డు రకం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుండగా.. సన్న రకం 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుండడంతో రైతులు ఆ వైపు మొగ్గు చూపుతున్నారు.

వానాకాలంలో రెండితలయ్యే అవకాశం

ఈ వానాకాలంలో సన్నాల సాగు యాసంగి కంటే రెండింతలయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిడంతో సన్నాల సాగుపై మరంత ఆసక్తి పెరిగింది. పంట కాలం 120–130 రోజుల వరకు కోతకు వచ్చే రకాలను సాగు చేయాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచిస్తోంది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో రైతులు సన్న రకం వరి విత్తనాల నారు పోసుకుని నాటుకు సిద్ధమవుతున్నారు.

ఎకరాకు 45 బస్తాల దిగుబడి



యాసంగిలో రెండు ఎకరాల్లో తెలంగాణ సోన రకం సాగు చేశా. ఎకరానికి 45 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటాలుకు రూ.2,500 ధర చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేశారు. పచ్చి ధాన్యం కావడంతో తూకం సైతం బాగా కలిసి వచ్చింది. ఈ వానాకాలంలో మళ్లి ఇదే రకం సాగుకు సిద్ధమయ్యా.

– ఈరప్ప, రైతు, హస్నాబాద్

సన్నాలకే మొగ్గు



యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరిని సాగు చేశా రు. వానాకాలంలో ఎక్కువగా సన్న రకం సాగుకు మొగ్గు చూ పుతున్నారు. ఈ సీజన్‌లో సన్నాల సాగు పెరిగే అవకాశం ఉంది. అధిక దిగుబడిని ఇచ్చే సన్న రకం వరి విత్తనాలు చాలా రకా లు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఇస్తారు. ఇప్పటికే సన్న రకం వరి విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నేతలు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్
- జీపీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా

అనంతగిరి: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీపీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. అధికారుల ఒత్తిడి తగ్గించాలన్నారు. నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన సిబ్బందికి కారోబార్ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు, కార్మికులు లక్ష్మయ్య, కుమార్, అశోక్, వెంకట్, రాజు, రవి, గోపాల్, శ్యామమ్మ, లక్ష్మమ్మ, నరేష్, బాలప్ప, సాయిలు, హనుమంతు, ఎల్లమ్మ, నర్సమ్మ, భారతి, మంగమ్మ, అనసూయ, రేణుక, పుష్ప, అమృత తదితరులు పాల్గొన్నారు

వేతనాలు చెల్లించాలి: బాల్‌రాజ్

బంట్వారం: ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరుతూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డానియల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీపీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు సదానందం, కార్యదర్శి బ్రహ్మం, సంఘం నాయకులు నాన్యనాయక్, ముకుందం, ఖదీర్, రవి, నర్సింలు, రత్నం, ఆనందం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

11 మంది బైండోవర్

ఆమనగల్లు: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి బైక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, తండాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చారకొండ నుంచి బైక్‌పై మాడ్గుల మండలం బ్రాహ్మ ణపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌ను తనిఖీ చేయగా అతనివద్ద 6 లీటర్ల నాటుసారా లభ్యమైందన్నారు. దీంతో నాటుసారా, బైక్‌ను సీజ్ చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేశామన్నారు. నాటుసారా కేసుల్లో నిందితులుగా ఉన్న 11 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. మాడ్గుల తహసీల్దార్ వద్ద ఐదుగురిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద ఒకరిని, కడ్తాల తహసీల్దార్ వద్ద ఐదుగురిని బైండోవర్ చేశామన్నారు.

శిథిల పాఠశాల భవనం పరిశీలన



హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్ స్లాబును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు



బీటలువారిన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నివేదిక అందజేశామని ఏఈ వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ నెల 13న 'సాక్షి' పత్రికలో 'భయం భయంగా బడికి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ కొడంగల్ ఎంపీడీఓను నివేదిక కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఉషశ్రీ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు మంగళవారం పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఏఈ రవి కిరణ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాన్ని పరిశీలించామని.. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని నివేదిక అందజేశామని చెప్పారు.

ఎస్పీకి అభినందనలు



ఎస్పీకి మొక్క అందజేస్తున్న డీఎఫ్ఓ

అనంతగిరి: నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డిని మంగళవారం అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలకు రసీదు అందజేస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కొడంగల్‌కు చెందిన ఇద్దరు దాతలు ముందుకు వచ్చారు. నందారం మిడిదొడ్డి కృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆనంద్ గుప్తారూ.1,11,111, మురళి గుప్తా రూ.51వేలు విరాళంగా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌కు మంగళవారం నగదు అందజేశారు.

తండ్రీకొడుకుల అదృశ్యం



నాగరాజు(ఫైల్)



రితీశ్(ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తండ్రీకొడుకులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. ఆర్ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన నాగరాజు (32) ఈ నెల 22న కుమారుడు రితీశ్‌ను వెంటబెట్టుకుని రాత్రి 10 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. తిరిగి వారు రాకపోవడంతో నాగరాజు భార్య శిరీష పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు బెడద తీవ్రమవుతోంది. రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్లే వారితో పాటుగా.. ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మంగళవారం తొమ్మిదేళ్ల బాలుడు పట్నం రుషి దుకాణానికి వచ్చి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్కలు దాడి చేయడంతో తొడ భాగంలో గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీధి కుక్కలు దాడులు పెరిగిపోతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఎదుగుదల లోపించిన, బలహీనంగా ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. అంగన్‌వాడీల బలోపేతం, యూనిఫాంల తయారీ, తాగునీటి సరఫరా, టాయిలెట్ల నిర్మాణం, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారంపై మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ కార్యదర్శి వాకాటి కరుణ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలోని 1,107 అంగన్వాడీ కేంద్రాల్లో ఇప్పటికే మంజూరైన వివిధ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ భవనాలకు మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం ఉండేలా పనులు వేగవతం చేయాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారంతో పాటుగా బాలామృతం తప్పక ఇవ్వాలన్నారు. సదరం క్యాంప్‌లలో అర్హులైన దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేలా, వీరికి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ప్రాతిపదికన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల సదనం, శిశు గృహాలను త్వరలోనే సందర్శిస్తానన్నారు. వయోవృద్ధుల ఖర్చుల నిర్వాహణకు సంబంధించిన దరఖాస్తుల పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులు సూచించారు. ట్రాన్స్‌జెండర్ల గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ అధికారి వెంకటేశ్వరమ్మ, ఎఫ్ఆర్ఓ వెంకటేశ్, సఖీ కేంద్రం అధికారి యశోద, బాలల పరిరక్షణ అధికారి ఆంజనేయులు, శిశు గృహ మేనేజర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై 14 రోజులు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తికాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్ తదితర మౌలిక వసతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి పాఠశాలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.



అనంతగిరి: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్రమశిక్షణతో మెరుగైన ఫలితాలు

- విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి
- తాండూరు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశోక్



సదస్సులో మాట్లాడుతున్న అశోక్

తాండూరు: తెలుగు మీడియంలో చదువుకుని ఎంతో మంది న్యాయ మూర్తులుగా కొనసాగుతున్నారని తాండూరు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్(న్యాయమూర్తి) నామాల అశోక్ అన్నారు. మంగళవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ చదువుకుంటేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో చదువుకు వసతులు లేక ఎంతో మంది ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారన్నారు. తెలుగు మీడియంలో చదువుకున్న వారు ఎందరో ప్రస్తుతం న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను పటిష్టం చేసాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమంలో బోధన కొనసాగుతుందన్నారు. విద్యార్థులు వ్యసనాల దూరంగా ఉండి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. వారి భద్రతకు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షీటీంలు బాలికలు, మహిళలకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పినమోని శ్రీనివాస్, కార్యదర్శి పి.చంద్రశేఖర్, పట్టణ ఎస్ఐ కాశీనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లినాథ్, న్యాయవాదులు పాశం రవికుమార్, అనితాగుప్తా, సోఫియా, లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన డోజర్

సూపర్‌వైజర్, డ్రైవర్‌పై కేసు



కరన్‌కోట్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన డోజర్

తాండూరు రూరల్: నేషనల్ హైవే రోడ్డు పనులు చేస్తుండగా పెను ప్రమాదం తప్పింది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రాంపూర్ సమీపంలో అల్మాస్ ఇంటర్నేషల్ పాఠశాల వద్ద హైవే రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు చదును చేస్తుండగా డోజర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం నేలకొరిగింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ ఏఈ వెంకట్‌నాయకుడు ఫిర్యాదు మేరకు పనుల సూపర్‌వైజర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. డోజర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దాచుకున్న సొమ్ము దోచేశారు

- రైతు ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు
- రూ.2లక్షల నగదు, 17 తులాల వెండి ఆభరణాలు మాయం



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

దుద్యాల్: రైతు పంట అమ్మగా వచ్చిన సొమ్మును గుర్తు తెలియని దుండగులు దోచేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. కొడంగల్ ఎస్ భరత్ కుమార్ తెలిపిన ప్రకారం.. హస్నాబాద్ గ్రామానికి చెందిన పోలేపల్లి వెంకటయ్య, వెంకటమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు పంట అమ్మగా వచ్చిన రూ.2లక్షలతో పాటు, వెంకటమ్మ పొలం పనికి వెళ్తున్నందున 17 తులాల వెండి పట్టీలను బీరువాలో దాచారు. రోజు మాదిరిగా సోమవారం పొలం పనులకు వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగుల గొట్టి బీరువాను ధ్వంసం చేసి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం బాధితుడు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

15 తులాల వెండి, రూ.పది వేల నగదు చోరీ

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంటికి కన్నమేసిన దుండగులు వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహాలింగపురం గ్రామానికి చెందిన నారాయణ, సత్యమ్మ దంపతులు వారం క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. అదే ఇంట్లో పై పోర్షన్‌లో ఉండే వారి కుమారుడు రవి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు ఇంటికి వచ్చి పరిశీలించి భూమి పాస్‌పుస్తకాలు, 15 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.